క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతు బజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 27, వంకాయ 23, బెండ 45, పచ్చి మిర్చి 40, కాకర 35, బీర 45, క్యాబేజీ 10, ఫ్రెంచిబీన్స్ 50, క్యారెట్ 25, దొండ 28-35, చిక్కుడు 40, గోకర 45, బీట్‌రూట్ 21, క్యాప్సికం 50, ఆలు 20, దోస 28, సొర 15, పొట్ల 15, ఉల్లి 14, చామగడ్డ 70 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అన్నదానం



అన్నదానం చేస్తున్న మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహేబ్‌నగర్ దుర్గస్థలి రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అమావాస్య సందర్భంగా సోమవారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రాంమోహన్‌గౌడ్ అన్న వితరణను ప్రారంభించారు. నాయకులు చింతల రవికుమార్, సతీష్‌కుమార్‌గౌడ్, నాగరాజు, వాసవి క్లబ్ సభ్యులు మాధవి రమేష్, భిక్షపతి, హరికృష్ణ, రఘురాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లక్ష్మీనగర్ పార్క్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, లీడ్ ఇండియా స్కూల్, లంబాటీ పీటీ, జయానగర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎల్ఐసీ కాలనీ, సైదాబాద్ ఓల్డ్ పీఎస్, వాటర్‌ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలిపివేస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు టీవీ స్టేషన్, మలక్‌పేట పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ వివరించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



నియామక పత్రాన్ని తీసుకుంటున్న జానకి

మలక్‌పేట: తెలంగాణ వినికిడి వికలాంగ ఉద్యోగుల సంఘం రంగారెడ్డి జిల్లా అసోసియేట్-2 ప్రెసిడెంట్‌గా వి.జానకి ఎన్నికయ్యారు. ఈనెల 19న ఆదివారం జరిగిన అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణ అధికారి బుచ్చిరెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అసోసియేషన్‌ను బలోపేతం చేయడానికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. హయత్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జానకి ఓఎస్‌గా పని చేస్తున్నారు.

కొనసాగుతున్న ఆధార్ అనుసంధానం

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్ పరిధిలో ఓటరు ఐడీకి ఆధార్ కార్డు సీడింగ్ ప్రక్రియ కొనసాగుతోందని సర్కిల్-6 డీసీ జయంత్ అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ... నియోజకవర్గంలో దాదాపు మూడు లక్షల వరకు ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో ఇప్పటి వరకు ఆధార్ సీడింగ్ 32 వేల వరకు పూర్తి అయిందని తెలిపారు. ఫొటో సిమిలర్ ఎంట్రీల జాబితా పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎన్నికల కమిషనర్ ఇచ్చిన జాబితా ప్రకారం ఓటరు లిస్టులో సిమిలర్ ఎంట్రీలు ఉన్నవారి వివరాలను సేకరించామని తెలిపారు. వారికి నోటీసులు జారీ చేసి తొలిగింపు ప్రతిపాదనలు చేస్తున్నట్లు డీసీ తెలిపారు. వివరాలను ప్రతి వారం రాజకీయ నాయకులకు అందజేస్తున్నట్లు తెలిపారు.

‘సహకారం’ లేకున్నా అభివృద్ధి చేశా!

మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



కొప్పుల నర్సింహారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్

మన్సూరాబాద్: కార్పొరేటర్‌గా ఎన్నికై రెండేళ్ల కాలంలో రూ. 46 కోట్లతో మన్సూరాబాద్ డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. నగరానికి శివారు ప్రాంతం కావడం.. నూతన కాలనీలు వెలుస్తుండటంతో ఆయా కాలనీల్లో ప్రజావసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. నిత్యం కాలనీలలో పర్యటిస్తూ ప్రజాసమస్యలను తెలుసుకుని ఆ దిశగా ప్రాధాన్యత క్రమంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. జీహెచ్‌ఎంసీ అధికారులపై ఎమ్మెల్యే ఒత్తిడి పెంచి జీహెచ్‌ఎంసీ నిధులపై పెత్తనం చెలాయిస్తూ ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్న డివిజన్ అభివృద్ధి కోసం అవమానాలు భరిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 7 కోట్ల నిధులు మంజూరు చేయించి ఆటోనగర్ డంపింగ్‌యార్డ్ నుంచి ఆటోనగర్ పారిశ్రామిక వాడకు సుందరమైన రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. మన్సూరాబాద్ కార్పొరేటర్‌గా రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, చేపట్టబోయే అభివృద్ధి పనులపై కొప్పుల నర్సింహారెడ్డితో ‘సాక్షి’ ఇంటర్వ్యూ...

ప్రశ్న: రెండేళ్లలో ఎన్నికల హామీలను నేరవేర్చారా?

జవాబు: గడచిన రెండు సంవత్సరాల్లో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ. 46 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టాము. 70 శాతం మేర ఎన్నికల హామీలను నేరవేర్చాను. సీసీ రోడ్లకు రూ. 17.36 కోట్లు, కమ్యూనిటీ హాళ్లు, పార్కుల ప్రహరీలకు రూ. 14.44 కోట్లు, శ్మశానవాటికలకు రూ. 25.30 లక్షలు, ట్రంక్‌లైన్ నాలాలకు రూ. 8.17 కోట్లు, భూగర్భ డ్రైనేజీకి రూ. 6.38 కోట్లు, స్పోర్ట్స్‌కు రూ. 29 లక్షలు మేర నిధులను మంజూరు చేయించాను.

ప్రశ్న: శానిటేషన్, పొంగుతున్న డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టారు?

జవాబు: శివారు ప్రాంతం కావడంతో కాలనీలు విస్తరిస్తున్నాయి. నూతన కాలనీలు ఏర్పడుతున్నాయి. అదేస్థాయిలో శానిటేషన్ సిబ్బందిని పెంచాలని కోరినా కమిషనర్, మేయర్ స్పందించడం లేదు. ఉన్న సిబ్బందిపై పనిభారం మోపి శానిటేషన్ చేయిస్తున్నాను. డ్రైనేజీ వ్యవస్థను జీహెచ్‌ఎంసీ నుంచి జలమండలి, సివరేజ్ బోర్డును బదలాయించడంతో సమస్యలు పెరుగుతున్నాయి. డ్రైనేజీల్లోని పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించేందుకు గల్పర్ వాహనాలు అందుబాటులో లేవు. ఉన్నతాధికారులకు విన్నవించినా నిధుల లేమితో పట్టించుకోవడంలేదు.

ప్రశ్న: ఎమ్మెల్యే, ఎంపీ, అధికారుల సహకారం ఎలా ఉంది?

జవాబు: నగర ప్రజలు చెల్లించిన సొమ్ముతో అభివృద్ధి పనులు చేపట్టాం. ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురాకపోగా, జీహెచ్‌ఎంసీ నిధులపై పెత్తనం చేలాయిస్తున్నారు. ఎమ్మెల్యే కోటా నిధుల నుంచి నయా పైసా మన్సూరాబాద్‌కు కేటాయించలేదు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉండటంతో అధికారులు ఎమ్మెల్యేకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎంపీ కొన్ని కాలనీలలో సీసీ కెమారాల ఏర్పాటుకు సహకరించారు.

ప్రశ్న: ప్రధాన సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: నిత్యం కాలనీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నా. ప్రధానంగా లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ట్రంక్‌లైన్‌లను ఏర్పాటు చేయిస్తున్నా. మన్సూరాబాద్ పెద్దచెరువును అన్నివిధాలా సుందరీకరించి మినీ టాంక్‌బండ్‌లాగా మారుస్తా. శ్మశానవాటికల్లో మౌలిక వసతులు కల్పించి, సుందరీకరణ చేపడుతున్నా. ఆటోనగర్ చెత్తడంపింగ్ యార్డ్ ప్రాంతం నుంచి పారిశ్రామిక వాడ వరకు రూ. 7 కోట్లతో రెండులైన్ల రోడ్డును వేయించా. మురుగు నీరు వెళ్లేందుకు ప్రత్యేకంగా ఎస్టీపీలను ఏర్పాటు చేయించా.

ప్రశ్న: రోడ్డు విస్తరణ చేపడతారా?

జవాబు: కామినేని చౌరస్తా నుంచి సుష్మ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలని కొంతకాలంగా కోరుతున్నా. అధికారులు సర్వేలు చేపట్టి రోడ్డుకు ఇరువైపుల ఉన్న నివాసితులకు నోటీసులూ ఇచ్చారు. పనులు వేగవంతం చేయాల్సి ఉంది. వీరన్నగుట్టపై ఉన్న శివక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తున్నా.

ప్రశ్న: అభివృద్ధి పనులకు ఏ మేర నిధులు అవసరమవుతాయి?

జవాబు: కాలనీలు, అపార్ట్‌మెంట్లు పెరిగిపోతున్నాయి. డ్రైనేజీలను ఆధునికీకరించాల్సి వస్తోంది. నూతన డ్రైనేజీలను నిర్మించాల్సి ఉంది. జీహెచ్‌ఎంసీ ఎదుట, ధర్నాలు, నిరసనలు చేపడితేనే నిధులు మంజూరు చేస్తున్నారు. డివిజన్ అభివృద్ధికి పోరాటాలు చేస్తే కేసులు నమోదు చేస్తున్నారు. అయినా బెదరక పోరాటాలు చేసి డివిజన్ సమగ్ర అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నా.

కంటివెలుగు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కంటివెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్వేత

సైదాబాద్: కంటి సంబంధిత సమస్యలు ఉన్నవారు కంటి వెలుగు కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆమె డివిజన్ పరిధిలోని ప్రెస్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఐఎస్‌సదన్‌లో సుబ్రమణ్యనగర్ కమ్యూనిటీ హాల్‌లో మొదట కంటి వెలుగు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని అయితే కాలనీవాసుల అభ్యర్థన మేరకు అధికారులతో చర్చించి పరిసర కాలనీలవాసులకు అందరికీ అందుబాటులో ఉండేలా ప్రెస్ కాలనీ కమ్యూనిటీ హాల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను అర్హులైన అందరూ ఉపయోగించుకోవాలని అన్నారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, శరత్‌చంద్రగౌడ్, అజయ్‌రెడ్డి, మాదన్నపేట యూపీహెచ్‌సీ వైద్య బృందం, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్ అనుచిత వైఖరిపై డీజీపీ, ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు

చంచల్‌గూడ: దళిత నాయకుడిపై భౌతిక దాడికి దిగి అనుచితంగా ప్రవర్తించిన ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ యాఖుత్‌పురా ఎస్సీ మోర్చా కన్వీనర్ ఎ.మోహన్‌కృష్ణ డిమాండ్ చేశారు. ఇటీవల కాలాపత్తర్ పీఎస్ పరిధిలో బీజేపీ ప్రజా గోస సభను ఎంఐఎం నాయకులు అడ్డుకున్న సంఘటనలో ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య పక్షపాత ధోరణితో వ్యవహరించడమే కాకుండా దళిత నాయకుడు కొడి మహేందర్‌పై భౌతిక దాడికి దిగి అనుచితంగా ప్రవర్తించిన వీడియోలో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దళిత నాయకుడి పట్ల ఇన్‌స్పెక్టర్ ప్రవర్తించిన తీరు అమానుషంగా ఉందని, అతని చర్యలు తీసుకోవాలని సోమవారం బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు డీజీపీకి, జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర మీడియా కన్వీనర్ జనపాల మధు, భాగ్యనగర్ జిల్లా కుర్మగూడ నాయకులు నాగరాజు, బ్రహ్మచారి, అజయ్, ప్రేమ్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

జ్ఞాపకాల పందిరిలో అ‘పూర్వ’ సమ్మేళనం

చంపాపేట: వంశీకృష్ణ గారు ఎలా ఉన్నారు... అంటూ ఓవైపు నుంచి పిలుపు. ఏంటీ వైద్యవృత్తి, రాజకీయాలలో బాగా బిజీ అయ్యారా... పిల్లలు సెటిల్ అయ్యారా అంటూ కుశల ప్రశ్నలు... ఏం బిక్కుమళ్ల శ్రీనివాస్... నువ్వేం మారలేదురా... అంటూ ఇంకో వైపు జోకులు... నలభై ఏళ్ల కిందట కలిసి చదువుకున్న వారంతా మళ్లీ కలిశారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి చంపాపేటలోని ఓ ఫంక్షన్ హాల్ వేదికైంది. వివరాలివీ... అచ్చంపేట ప్రభుత్వ పాఠశాలలో 1981వ విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న 120 మంది విద్యార్థులు సోమవారం ఆత్మీయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరిట కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువుకు పాదాభివందనం చేసి ఘనంగా సన్మానించారు. దివంగతులైన వారికి నివాళులు అర్పించారు. నలభై ఏళ్ల కిందట తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ జీవితానికి సరిపడా మధుర జ్ఞాపకాలను మూటకట్టుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాజీ శాసన సభ్యులు, వైద్యనిపుణులు వంశీకృష్ణ, ఆర్టీఓ శ్రీనివాసరెడ్డి, యాదగిరి, బిక్కుమళ్ల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, మధుసూదన్‌రావు, కొండల్‌రావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమమే లక్ష్యం: ఐఎన్‌టీయూసీ




జితేందర్‌కు అభినందిస్తున్న నేతలు

చంపాపేట: రాష్ట్రంలోని సంఘటిత, అసంఘటిత కార్మికులు సంక్షేమమే ఐఎన్‌టీయూసీ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్ మిద్దెల జితేందర్ అన్నారు. సోమవారం చంపాపేటలోని ఐఎన్‌టీయూసీ కేంద్ర కార్యాలయంలో కార్మిక సంఘ నేతల ఆధ్వర్యంలో జితేందర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయె శాసనసభ ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికార పగ్గాలు చేపట్టడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పెల్లి రాజశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు భాస్కర్, వెంకటేష్‌యాదవ్, కార్మిక సంఘ నేతలు పాల్గొన్నారు.

మార్కెట్ స్థలాన్ని అన్యాక్రాంతం చేస్తే సహించం

- కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా
- రేకుల ప్రహరీని తొలగించాలని సిటీ ప్లానర్ ఆదేశం



సిటీ ప్లానర్ ప్రసాద్‌కు వివరిస్తున్న కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా

చైతన్యపురి: గతంలో కొత్తపేటలో ఉన్న ఫ్రూట్ మార్కెట్ స్థలం అన్యాక్రాంతం చేయాలని చూస్తే సహించేది లేదని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి హెచ్చరించారు. టిమ్స్ స్థలంలో రేకుల ప్రహరీ నిర్మాణం జరుగుతున్న విషయం తెలుసుకుని వారు అక్కడకు చేరుకున్నారు. సుమారు ఎకరం పైగా స్థలాన్ని వదిలేసి ప్రహరీ నిర్మాణం చేయటంపై పలు అనుమానాలు కలుగుతున్నాయని ముఖ్యమంత్రి కేసీఆర్ టిమ్స్ హాస్పిటల్ నిర్మాణం కోసం హెల్త్ డిపార్ట్‌మెంటుకు అప్పగిస్తే అధికారుల పర్యవేక్షణ లేక ఒక వర్గానికి అన్యాక్రాంతం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. అక్రమంగా ఏర్పాటు చేసిన పార్టీషన్‌ను తొలగించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని లేకుండే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని సామ రంగారెడ్డి హెచ్చరించారు. ఇదే విషయాన్ని జోనల్ కమిషనర్ పంకజ, ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ సిటీ ప్లానర్ ప్రసాద్, చైతన్యపురి ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ వెంకట్‌లకు కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు.

రేకుల ప్రహరీని తొలగించాలని సిటీ ప్లానర్ ఆదేశం...

కార్పొరేటర్ ఫిర్యాదు మేరకు జీహెచ్‌ఎంసీ సిటీ ప్లానర్ ప్రసాద్ టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బందితో టిమ్స్ నిర్మాణ స్థలంలో ఏర్పాటు చేసిన ప్రహరీని పరిశీలించారు. వెంటనే ప్రహరీ నిర్మాణాన్ని నిలిపి వేయాలని, ఏర్పాటు చేసిన రేకుల ప్రహరీని వెంటనే తొలగించాలని ఎల్‌అండ్‌టీ సిబ్బందికి సిటీ ప్లానర్ ప్రసాద్ ఆదేశించారు.

సిరిపురం యాదయ్య త్యాగం చిరస్మరణీయం

నాగోలు: తెలంగాణ సాధన కోసం అమరుడైన అమరవీరుడు సిరిపురం యాదయ్య త్యాగం ఎప్పటికీ మరువలేనిదని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. సిరిపురం యాదయ్య 13వ వర్ధంతిని కొత్తపేటలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదయ్య విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 21 ఏళ్ల వయసులో తెలంగాణ సాకారం కోసం భగభగ మండే మంటల్లో ఎర్రటి సూర్యుడిలా తాను జ్వలించి కోట్లాది మంది ఆకాంక్ష అయన తెలంగాణ సాధన కోసం అమరుడైన యాదయ్య త్యాగాన్ని గుర్తు చేశారు. తరంగా ఫౌండేషన్ చైర్మన్ సిలివేరు వెంకట్ గౌడ్, నేతలు వేణుగోపాల్, లోకేష్, పి.శివకుమార్, నర్సింహా, తాండ్ర శివరాజ్, ఎలుక మల్లేష్ గౌడ్, జగన్, సాయి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



మూడు కేజీల గంజాయి పట్టివేత



చైతన్యపురి: అక్రమంగా తరలిస్తున్న మూడు కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ జానకిరెడ్డి సమాచారం మేరకు... ఆంధ్రప్రదేశ్‌లోని అరకు నుంచి నగరానికి అక్రమంగా గంజాయిని తరలించి అవసరమైన వారికి అందజేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు కొత్తపేట చౌరస్తాలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. బండ్లగూడ డిపో సమీపంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివసించే బడే బాలకృష్ణ(25), వసుపుల సాయి చైతన్య(22), పాలెల్లు నితిన్(20)లు గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. వారి నుంచి మూడు కేజీల డ్రై గంజాయి, ఒక సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం సరూర్‌నగర్ పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేశారు. గంజాయి తరలించటంలో హస్తం ఉందని భావిస్తున్న తట్టిఅన్నారంకు చెందిన కిరణ్(26), అరకుకు చెందిన బాబా పరారీలో ఉన్నారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మలక్‌పేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి



సైదాబాద్‌వాసులతో సమావేశమైన ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ కొత్తకాపు అరుణరెడ్డి

ఎమ్మెల్యే బలాల

సైదాబాద్: మలక్‌పేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. సోమవారం ఆయన సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఎస్‌బీహెచ్ ఏ, బీ, సీ, జీఏ-1, జీఏ-2, వీకే ధాగేనగర్, కళ్యాణ్‌నగర్ కాలనీవాసులతో సమావేశమయ్యారు. కాలనీవాసులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా బలాల మాట్లాడుతూ... ప్రాధాన్యత క్రమంలో డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారిస్తామన్నారు. సైదాబాద్‌లో ప్రధాన, అంతర్గత రహదారులు, తాగునీరు, విద్యుత్ సమస్యలు తదితర సమస్యలపై అధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మలక్‌పేట బీజేపీ సీనియర్ నాయకుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమై సమస్యలు పరిష్కరిస్తున్నా

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: కాలనీవాసులతో నిత్యం మమేకమై కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తున్నానని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. పద్మావతీనగర్‌కాలనీలో సోమవారం మార్నింగ్ వాక్ చేపట్టి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... కాలనీ సంక్షేమ సంఘ భవనానికి అదనపు గదుల నిర్మాణం, చిల్డ్రన్ పార్కులో వసతులు కల్పిస్తానని తెలిపారు. కాలనీలో పారిశుద్ధ్యంపై క్రమం తప్పకుండా చేపట్టేందుకు చర్యలు చేపడతానని స్పష్టం చేశారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు విజయభాస్కర్‌రెడ్డి, భాస్కరాచారి, మధుసూదన్, కిషన్, పద్మారెడ్డి, రంగయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.



పద్మావతీనగర్‌వాసులతో చర్చిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి



గిరిజనుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి

హస్తినాపురం: గిరిజనుల సంక్షేమం, అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి వాటిని పటిష్టంగా అమలు పరుస్తున్నారని ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ నందనవనంలోని ఇంద్రసేనారెడ్డి నగర్‌లో సపావట్ కపూర్‌నాయక్, గోపీసింగ్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రామ్‌చందర్‌నాయక్, కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్, సీనియర్ నాయకులు గజ్జల మధుసూదన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ముద్దగౌని లక్ష్మీప్రసన్న, పద్మానాయక్ తదితరులు హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు సత్యంచారి, గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నారగోని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌నాయక్, మంగ్యానాయక్, హేమూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

మూసారంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పని చేయాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశం వెంకటేశ్వర్లు, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, కోశాధికారి తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి, తదితరులు సలీంనగర్ తేజ్‌నగర్ పార్కు వద్ద సోమవారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం చెందిందని విమర్శించారు. సీఎం కేసీఆర్ నిరంకుశ విధానాలను తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. శక్తికేంద్రం ఇన్‌చార్జి వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో స్థానిక నేతలు యాదగిరి సురేందర్, కొప్పుల దినేష్, శ్రీనివాస్, చందు, అన్నమయ్య, వెంకటేష్, సంతోష్, సుభాష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో లిక్కర్ పాలసీ మాత్రమే అమలవుతోంది

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి



మాట్లాడుతున్న రాణి రుద్రమదేవి

మన్సూరాబాద్: తెలంగాణలో లిక్కర్ పాలసీ మాత్రమే అద్భుతంగా అమలవుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి విమర్శించారు. ప్రజాగోస.. బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌ను మన్సూరాబాద్ డివిజన్ రాజరాజేశ్వరీ కాలనీలోని బొమ్మలగుడి వద్ద సోమవారం రాత్రి నిర్వహించారు. ఆమెతో పాటు బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలంగాణలో నియంతృత్వ పాలన నడుస్తోందని, ప్రజాస్వామ్య పరిపాలన తీసుకొచ్చేందుకు బీజేపీకి మద్దతు పలుకాలని కోరారు. ప్రధానీ మోడీ నాయకత్వంలో దేశ ఆర్థిక స్థితి 3వ స్థానానికి ఎదిగిదందని, వచ్చే రెండేళ్లలో అగ్రదేశంగా భారత్ నిలబోతుందన్నారు. ప్రజలకు జవాబుదారీగా పనిచేయాల్సిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరకుంశ పాలన సాగిస్తుందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని గెలిపించి డబుల్ ఇంజన్ సర్కార్‌ను తీసుకురావాలని పిలుపునిచ్చారు. 6359 119 119 నెంబర్‌కు మిస్డ్ కాల్ చేసి బీజేపీ మద్దతు ఇవ్వాలని కోరారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్, నాయకులు కడారి యాదగిరియాదవ్, శ్యామల, కవితారెడ్డి, సబితారెడ్డి, కొండల్‌రెడ్డి, పాతూరి శ్రీధర్‌గౌడ్, హరీష్‌రెడ్డి, ఎంజాల జగన్, కళ్లెం శంకర్‌రెడ్డి, సాయిరాం గౌడ్, సోమనాథ్, పారంద సాయి పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు ప్రాధాన్యం

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ఎల్‌బీనగర్‌లో రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్

ఎల్‌బీనగర్: తెలంగాణ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రోడ్ల విస్తరణ, సుందరీకరణకు అధిక ప్రాధన్యత ఇస్తోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ, ఇతర శాఖ అధికారులతో కలసి నాగోలు-మందమల్లమ్మ చౌరస్తా వరకు చేపట్టనున్న విస్తరణ ప్రణాళికలో భాగంగా రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రజారవాణాను బలోపేతం చేసేందుకు, నగరంలో ట్రాఫిక్ సమస్య నివారణకు, రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్లను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎప్పటికప్పుడు నూతన ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుందన్నారు. నాగోలు నుంచి మందమలమ్మ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణతోపాటు రోడ్లకు ఇరువైపులా ఫుట్ పాత్‌ల, సైక్లింగ్ ట్రాక్ నిర్మాణం, వాటి మధ్య అందమైన పూల మొక్కలను ఏర్పాటు చేసి సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలపారు. నగరంలో ఇప్పటికే ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు పూర్తయిన నేపథ్యంలో వాటికి అనుబంధంగా ఉన్న రోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోందన్నారు. అప్పటికే నగరంలో వాహనాలు ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతుందని అందుకే ప్రజలు తక్కువ దూరాలకు వాహనాలు వినియోగించకుండా నడక లేక సైకిళ్ల ద్వారా వెళ్లేందుకు వీలుగా రోడ్లను విస్తరణ చేపట్టినట్లు తెలిపారు. వచ్చే జూన్, జూలై నాటికి నాగోలు నుంచి మందమల్లమ్మ చౌరస్తా వరకు సుందరీకరణ పనులు పూర్తయి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. జోనల్ కమిషనర్ పంకజ, ఎస్ఈ అశోక్‌రెడ్డి, సిటీ ప్లానర్ ప్రసాద్‌రావు, ఈఈ రమేష్‌బాబు, హార్టికల్చర్ అధికారి రాజ్‌కుమార్, డీసీలు మారుతీదివాకర్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.